


## -వసంతరావు దేశపాండే

పెళ్ళి పందిరి నిండా విచిత్రమైన వాసనలు గుబాళిస్తున్నాయి. పందిట్లో ఉన్న వాళ్ళంతా హడావిడిగా ఉన్నారు. ఆడవాళ్ళు, పిల్లలు, అమ్మాయిలు ఎంతో పని ఉన్నట్టుగా అటూ, ఇటూ తిరుగుతున్నారు—ఖరీదైన పట్టు చీరల్నీ, ఒంటి నిండా నగల్నీ మోయలేక మోస్తూ! ఎండాకాలం. మహా ఉక్కగా ఉంది. చెమట పోస్తున్నా తుడుచు కోవడానికి కానీ, కాస్త విసురుకోవడానికి కానీ తీరిక లేదు. పిల్లలు తోకల్లా వెంట తిరుగుతున్నారు. పడుచు వాళ్ళంతా పందిట్లో ఒక మూలగా చేరి హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అరగంట కష్టపడి చేసుకున్న అలంకరణ అనవసరంగా పాడై పోతుందని కర్ఛీఫ్‌లతో నాజూకుగా ఒత్తుకుంటూ విసనకర్రలతో విసురుకుంటున్నారు, నవనాగరికంగా.


ఈ కాలపు ఆడపిల్లలకు పసుపు కుంకుమ అంటే ఎలర్జీ! అంతా కాస్మెటిక్స్ మయం! గతంలోని ఆడపిల్లలు చెట్టున పూసిన పూలైతే, ఈ కాలపు ఆడపిల్లలు అందమైన ప్లాస్టిక్ పువ్వులు.

మగవాళ్ళ హడావుడి వేరే ఉంది. పని లేని కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు హాయిగా. లౌడ్‌స్పీకర్‌లో పాటలు లౌడ్ గానే వినిపిస్తున్నాయి, మాట్లాడే వాళ్ళకు ఇబ్బందిగా. బాండ్ మేళం వాళ్ళు వరాండాలో కూర్చుని ఒకటే వాయించేస్తున్నారు. పెళ్ళి అంటే ఇదేనేమో? బాండ్ మేళం, గ్రామఫోను రికార్డులు, పసిపిల్లల ఏడుపులు, గొంతు చించుకున్నా వినిపించని మాటలు, చెమటలు, పసుపు కుంకుమ, గంధం— ఇత్యాదుల వింత వింత వాసనల్లో వధూవరుల విచిత్రానుభూతులు.

పందిట్లో చాలా మంది అమ్మాయిలు తిరుగు తున్నారు. కాని, హరికృష్ణ కళ్ళు మాత్రం శారదనే వెన్నంటి తిరుగుతున్నాయి. అతను కళ్ళతోనే కవ్విస్తున్నా డామెను. శారద పెళ్ళి కూతురికి చాలా దగ్గరి బంధువులా ఉంది. అందుకనే చాలా హుషారుగా తిరుగుతూంది. హరికృష్ణ శారద అన్నకు ఫ్రెండ్. శారదతో చూపులు కలిశాక, అతనికి కొత్త ఉత్సాహం పుట్టుకు వచ్చింది.

శారద కళ్ళుకూడా హరికృష్ణకు అనుకూలంగానే కదులుతున్నాయి. అనుకోకుండా అతనితో చూపులు కలుపుతూంది. మరుక్షణం దొరికిపోయిన దొంగలా చూపులు తిప్పేసుకుంటూంది. ఇద్దరూ అలా చూపుల




తోనే దాగుడుమూత లాడుకుంటున్నారు. జీవితంలో మొదటిసారి వారి హృదయాలు తీయగా, మధురంగా స్పందిస్తున్నాయి, స్త్రీ పురుషుల ప్రేమకు మొదటి మెట్టుగా.

పెళ్ళి సందట్లో ఎవరు ఎవరితో మాట్లాడినా ఎవరూ పట్టించుకోరు. పోతే, పని ఉన్నా, లేకపోయినా కాస్త హడావుడిగా ఉన్నట్లూ, అవతల కొంపలు తగలబడి పోతున్నట్లూ అటూ ఇటూ తిరగాలి. అంతే. హరికృష్ణ అదే చేశాడు. ఆమె పక్కగా చేరి ఏమో అన్నాడు. కానీ, ఆ మాట బాండ్ గందరగోళంలో కలిసిపోయి, శారదకు వినిపించలేదు. బాండ్ వాళ్ళ వేపు కోపంగా చూశాడతడు. శారద చిన్నగా నవ్వుతుంది, చిలిపితనం ఒలకబోస్తూ.

బొమ్మరివాడి చేతిలో కోతి ఆడినట్లుగా, బ్రాహ్మణుడి చేతిలో వధూవరులు ఆడి అలు పుగల మయ్యా మనిపించుకున్నారు. చెమటతో నుదుటి కుంకుమ కలిసి కాలువగా నాసికాగ్రం దాకా సాగింది పెళ్ళికొడుక్కు. గాలి లేక, ఊపిరాడక ఉక్కిరి బిక్కిరై వధువు మెడలో తొందరగా మూడు ముళ్ళూ వేసి, నిటారుగా నిలబడి గుండె నిండా హాయిగా గాలి పీల్చుకున్నాడు.

వధూవరుల మీద అక్షతలు చల్లుతున్నారందరూ. హరికృష్ణ శారదపై చల్లాడు. తల ఎత్తి అతడి వైపు చూసింది. అతడి కళ్ళలోని చిలిపితనాన్ని గమనించి, సిగ్గుతో తల వంచుకుంది పెళ్ళి కూతురులా. మనసులో తమ నెవరైనా గమనిస్తున్నారేమోనని భయం!

వాన వెలిసినట్లు పెళ్ళి ముగిసింది. బంధువులు చాలామటుకు వెళ్ళి పోయారు. దగ్గరి వాళ్ళ మనుకున్న వాళ్ళు మిగిలి పోయారు, మిగిలిన తంతు ముగించడానికి పెళ్ళికూతురు అన్న స్నేహితులు హరికృష్ణ, భాస్కర్‌కూడా ఉండిపోయారు, స్నేహితుడి బలవంతం మీద.

మగవాళ్ళు చాలామంది సుష్టుగా కాఫీ, టిఫిన్లు పట్టించి, చలోక్తులు విసురుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ పేక పరిచారు. హరికృష్ణ మాత్రం శారదను ఒంటరిగా దొరికించుకునే అవకాశం కోసం కాచుకుకూర్చున్నాడు. భాస్కర్ ఒంటరిగా కూర్చుని ఏదో పత్రిక తిరగేస్తున్నాడు. అతను చాలా మట్టుకు ఒంటరిగానే ఉంటాడు. మందలో కలవడు. మితభాషి. ఎంతగానో అవసరమైతే తప్ప మాట్లాడడు. హరికృష్ణ అందుకు పూర్తిగా వ్యతిరేకం. ఆలోచనా విధానంలోనూ, అభిప్రాయాల్లోనూ వాళ్ళు తూర్పూ పడమరలే. అయినా, హరికృష్ణకు భాస్కర్ అంటే ఆరవ ప్రాణం. భాస్కర్ నిశ్చలమైన సరస్సు లాంటి వాడైతే, హరికృష్ణ సెలయేరు.

శారదను ఎలాగో ఒంటరిగా దొరికించుకున్నాడు హరికృష్ణ. ఏమేమో మాట్లాడదామనుకున్నాడు కానీ, నోరు బొత్తిగా సహకరించ లేదు. శారద చూపులు నేలలోకి దూసుకువెళ్ళిపాతుకుపోయాయి బిడియంతో అతను ఏం మాట్లాడతాడో, ఏమడుగుతాడో? ఏమడిగితే ఏం జవాబు చెప్పాలో? ఊపిరి బిగబట్టి నిలబడిపోయింది బొమ్మలా.

హరికృష్ణ అంతే. ఏం మాట్లాడాలనుకున్నాడో మరిచిపోయాడు. చదివింది మరిచిపోయి పరీక్ష

హాలుకు వెళ్ళిన విద్యార్థిలా ఉం దతడి పరిస్థితి. అన్నీ మరిచిపోయి శారదనే చూస్తున్నాడు.

ఆత డేమీ మాట్లాడక పోవడంతో శారద ముందుకు కదిలింది. దానితో హరికృష్ణకు చైతన్యం వచ్చి ఏం చేయాలో తోచక, "చూడండి" అన్నాడు. ఎటు చూడమన్నాడో తెలియక, అతడి కళ్ళలోకే చూసింది సూటిగా. అవి గమ్మత్తుగా నవ్వుతున్నాయి. మెల్లగా అడిగాడు—"మీ పేరు?" అని. అతడి సూంచిచూపులు మరల్చి, తీయగా వేణువు వూదినట్లు "శారద" అంది. అని ముందుకు కదిలింది. హరికృష్ణ 'శారద' అని ఒకసారి స్వగతంలో అనుకుని, తన చేతినే ముద్దు పెట్టుకుని, గాలిలోకి విసిరాడు. ముద్దు చప్పుడు విని వెనుదిరిగి చూసింది. అతని కళ్ళలోని చిలిపితనం తనను కవ్విస్తున్నట్లు కనిపించే సరికి అసంకల్పితంగానే నాలుక చాచి వెక్కిరించింది, చిన్న పిల్లలా. ముద్దుగా నవ్వుకున్నాడు హరికృష్ణ. సిగ్గు విడి వెళ్ళిపోతున్న శారద వెనకే పరుగెత్తిన గాలి తెమ్మెర 'సాయంత్రం సినిమాకి' అంటూ ఆమెను దాటేసి వెళ్ళిపోయింది.

పెళ్ళయిన జంటకు ఆ రాత్రే శోభనం. అంతా ఎవరి పనుల్లో వా ళ్ళున్నారు. శారద, హరికృష్ణ సినిమా దగ్గరికి చేరేసరికి భాస్కర్ వచ్చి కలిశాడు. శారద పక్కను హరికృష్ణ, అతని పక్కను భాస్కర్ కూర్చున్నారు. శారదతో ఎన్నో కబుర్లు చెప్పాలనీ, ఆమెను నవ్వించాలనీ, ఏమేమో అల్లరి చేయాలనీ ఉంది హరికృష్ణకు. సినిమా మొదలయింది. పక్క పక్కను కూర్చోవడంతో ఒకరి భుజా లొకరివి తాకుతున్నాయి. ఆమె చేయి అతని చేతికి దగ్గరగా ఉంది. అతను వేళ్ళతో ఆమె గాజుల్ని అనవసరంగా సవరిస్తున్నాడు. శారద అంతా గమనిస్తూనే ఉంది. కానీ, ఏమీ అనలేదు. అదో మధురానుభూతి.

తెరపై నాయకుడు కాలేజీలో నాయిక చేత చెంప దెబ్బ తిని మరెక్కడో ఆవిడ కాళ్ళు పట్టుకుని, మరి కాస్సేపటికి పబ్లిక్ పార్కులో, పంచరంగుల్లో నాలుగు డ్యూయెట్లు పాడుకుని, ఎందుకో కానీ ఘోరమైన త్యాగాలు చేసి, ఎలాగైతేనేం ఆవిణ్ణి పెళ్ళాడతాడు. బాగానే ఉంది. ఇక శోభనం. తెలుగు సినిమాలో ఏం చూపించినా, చూపించకపోయినా శోభనం మాత్రం తప్పక చూపించి తీరతారు. పెళ్ళయిన తరవాత శోభనం కాక మరేమిటి? వంటంతా అయ్యాక, తినక పెంటపై పడేస్తారా? మరి దాన్ని పబ్లిక్‌గా తెరపై చూపించడమెందుకో?

ఆ సీను మన వాళ్ళిద్దర్నీ కాస్త ఇబ్బంది పెట్టిం దనీ చెప్పవచ్చు. హరికృష్ణ మెల్లగా శారద అరచేతిలో గిల్లాడు. చిరుకోపంతో చేయి లాక్కుంది గబుక్కున. ఇదంతా ఓరగా గమనిస్తూనే ఉన్నాడు భాస్కర్ మరి కాస్సేపటికి తెరపై క్లోజప్‌లో హీరోయిన్ రేప్ సీను, పది నిమిషాల పాటు. శారద చూడలేక తల దించుకుంది. హరికృష్ణ ఇబ్బందిగా ముడుచుకు పోయి కూర్చున్నాడు.

సినిమా ముగిసింది. ఇల్లు అక్కడికి చాలా దూరం. భాస్కర్ రిక్షాల్లో వెళదామన్నాడు. హరికృష్ణ ఒప్పుకోక పోవడంతో అతను ఒక్కడూ రిక్షా ఎక్కాడు. జనం ఇద్దరు ముగ్గురు చొప్పున



జట్లు జట్లుగా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. శారదా, హరికృష్ణ ఏదో మాట్లాడుతూ నడుస్తున్నారు కానీ, అసలు విషయం ఎలాగడపాలో అర్థమై చావడం లేదు హరికృష్ణకు. ఏమైతేనేం? అడగాలనుకున్నవి అడుక్కోకుండా, చెప్పుకోవాలను కొన్నవి చెప్పుకోకుండానే, ఒకర్నిగురించిఒకరికి క్షుణ్ణం కాకపోయినా బాగానే అర్థమయింది. అర గంటకు పైగా నడిచి ఇల్లు చేరుకున్నారు.

ఆమెను వదలా లంటే బాధగా ఉం దతడికి. 'గుడ్‌నైట్' అంటూ ముందుకు కదిలిన శారద చేతిని చనువుగా పట్టుకున్నాడు. చీకట్లో. అలాగే ఆ చేతిపై సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు. ఆమె కళ్ళు వాల్చి నిలబడి పోయింది. ఇంకా దగ్గరగా రాబోయిన అతణ్ణి అనునయంగా వారించింది. దిగులుగా నిలబడి పోయిన ఎదపై జాలిగా, నిస్సహాయంగా వాలిపోయింది. ఆమె చుట్టూ చేయి చేర్చి గుండెకు అదుముకున్నాడు. గాలి చల్లగా ఉంది. కౌగిలి వెచ్చగా ఉంది. తప్పదన్నట్లుగా విడిపోయారు.

అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. మంచా లేవీ ఖాళీగా లేకపోవడంతో ఒక చాపా, దిండూ తీసుకుని డాబా పైకి వెళ్ళింది శారద.

ఆకాశం నల్లగా ఉంది, కోయిలలా. నల్లటి కాగితంపై చమ్కీ అద్దినట్లు మెరుస్తున్నాయి చుక్కలు. జరీ పూలతో మెరుస్తున్న నల్లజలతారు మేలి ముసుగులా ఉంది ఆకాశం. చల్లటి గాలి చేరువ లోని శిరీష వృక్షం మీది సౌరభాన్ని మత్తుగా మోసుకు వస్తోంది. ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదు శారదకు.

స్త్రీ హృదయం శ్రుతి చేసిన వీణ. నిర్మలమైన తటాకం లాంటిది. ఆ నీటిలో ఎంత చిన్న ఇసుప రేణువు పడ్డా, అలలు మనోహరంగా లేస్తాయి. హరికృష్ణ కౌగిలి వెచ్చదనం శారదను ఇంకా వీడ లేదు. అతను ముందుకు వస్తున్నప్పుడు వారించ లేక పోయి ఉంటే ఏం చేసేవాడో ఆలోచిస్తోంది. వూహకు అందనిది ఏదీ లేదు. అయినా, సరిగ్గా వూహించలేక పోతూంది. మరుక్షణం తెర మీద చూసిన రేప్ సీను మనసులో మెదిలింది. అక్కడి నుంచి శోభనం గదికేసి సాగాయి ఆమె ఆలోచనలు.

వాళ్ళిద్దరూ శోభనం గదిలో ఏం చేస్తుంటారు? ఘోరమైన ఆలోచన. ఆలోచన, వూహా శక్తి మనిషికి దేవు డిచ్చిన వరాలు. ఆ వరాల వల్లనే మనుషులకూ, జంతువులకూ మధ్య అంతరం పెరిగింది. అయితే, ఆ వరాలు పెడమార్గం పట్టడం ప్రమాద హేతువే. శారద మెదడు పట్టాలు తప్పుతూంది. వూహిస్తూంది. ఆలోచిస్తూంది. కనబడని దృశ్యాన్ని వూహల్లో రూపు కట్టించుకొనే ప్రయత్నంలో ఉంది. మెదడుకు పని, నరాలపై ఒత్తిడి— ఏం చేస్తుంటారు? వాళ్ళేం చేస్తూ ఉండి ఉంటారు?

పెళ్ళికూతురు లక్ష్మి తన కన్నా తొమ్మిదేళ్ళు చిన్న. దాని వయస్సు కేవలం పదహారేళ్ళు. తనకు పాతికేళ్ళు. అయినా, దాని పెళ్ళే ముందుగా జరిగింది. తన కిప్పట్లో ఆ గీత ఉన్న సూచనలు కనబడ్డంలేదు. అందుకు కారణం—తండ్రి ఒక సామాన్యుడైన అప్పర్ ప్రైమరీ స్కూల్ టీచర్—ఆర్థిక స్థితి. ఆయన వికటాట్టహాసం చేసే వరకట్న పిశాచి కోరలు చూసి బెదిరిపోగలడే కాని, కట్నం సమర్పించి, దాన్ని ప్రసన్నం చేసుకోలేడు.

నిశ్చలంగా నిలిచిన నీటిలో చిరుగాలి సైతం తరంగాల్ని సృష్టించగలదు. లేచిన ప్రతి కెరటం ఒడ్డుని తాకి, తిరిగి వెనక్కు వెళ్ళి నీటిలో కలిసి పోవాలి. ఎక్కడికో పరుగెత్తా లనుకొన్న కెరటం మళ్ళీ బయలుదేరిన చోటుకే వెళ్ళవలసి వస్తుంది వెళ్ళుతుంది. అది దాని ప్రకృతి.

శారద ఆలోచనలు మళ్ళీ వెనకకు సాగి, శోభనం గదిలోని దృశ్యాన్ని వూహిస్తున్నాయి. ఆమె శరీరం వేడెక్కుతూంది. నరాలు ఉద్రేకించాయి. ప్రకృతికి ఆమె బాధ పరిహాస భాజనంగా అనిపించిందేమో? చల్లగాలి ఆమెను చక్కిలిగింతలు పెడుతూంది. శరీరం వేడిగానూ, గాలి చల్లగానూ, శిరీష సౌరభం మత్తుగానూ ఉన్నాయి. మెదడు పూర్తిగా మొద్దుబారింది. కళ్ళు వాలిపోయాయి.

విరహంతో వేగుతూన్న మాధవీలతకు గున్న మావి చేయూత దొరికింది. దొరికిన ఆధారాన్ని

వదలకుండా పెనవేసుకుంది ప్రేమగా. ఎవరిదో వూపిరి వెచ్చగా తగిలింది—చెంపలకూ, మెడకూ, గుండెకూ కూడా. మనసులో వేలు వీణలు మోగుతున్నట్లుగా ఉంది. "కృష్ణా!" అంది పరవశంగా. మాట్లాడవలసిన సమయం కాదనుకున్నాడేమో 'వూఁ!'' అన్నాడు మత్తుగా.

లేచిన కెరటాలు ఒడ్డుకు చేరాయి.

నీటిలో మళ్ళీ మునుపటి ప్రశాంతత.

పల్లటి రాత్రి తెల్లవారి తూర్పు మందారం విచ్చుకుంటూంది. పక్షులతోబాటు ప్రేమపక్షులూ మేల్కొన్నాయి. శారద, హరికృష్ణ గత రాత్రి అనుభవాలను నెమరువేసుకుంటూ కళ్ళు తెరిచారు. ఆ నాటి సూర్యోదయంలో ఏదో కొత్త అందం, వూహించలేని ప్రత్యేకత కనిపిస్తున్నాయి.

భాస్కర్ ఇంకా గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

శారద హరికృష్ణ ఎదుట పడడానికి సిగ్గుపడుతూంది. రాత్రి తన ప్రవర్తనే అందుకు కారణమని అతని మనసు తీయగా మూలిగింది. రోజంతా గడిచింది. శారద మాత్రం అతనికి ఎదురుపడలేదు. అతను ప్రయాణానికి సిద్ధమయ్యాడు, భాస్కర్‌తో బాటు.





అపూర్వమైనది లిరిల్. పచ్చని తరంగరేఖలు. నిమ్మకాయల్లోని తాజాదనపు ఉత్సాహంతో. చురుకైన, పులకరింపజేసే లిరిల్ మిమ్మల్ని నవనారిగా రూపొందిస్తుంది.

Liril

లిరిల్
తాజాదనపు సబ్బు నిమ్మకాయల తాజాదనపు ఉత్సాహంతో

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

వీళ్ళిద్దర్నీ సాగనంపటానికి మరి కొందరు స్టేషన్‌కు వచ్చారు. శారద కూడా వచ్చింది. అతను వెళ్ళిపోవడం ఆమెకు చాలా బాధగా ఉంది. అతనితో మాట్లాడలేకపోతూంది. మనసు బాధలో మునిగిపోయింది. ఏదో చెప్పాల, తన గుర్తుగా మధురమైనది ఏదో ఇవ్వాలి. కానీ, ఆపుకోలేనంతటి దుఃఖం. గుండెలో ఏదో బరువు. అతని ఎదమీద వాలి సేద దీర్చుకోవాలనే తపన. ఆమె మనఃస్థితిని స్టేషన్‌కు వచ్చినప్పటినుంచీ కనిపెడుతూనే ఉన్నాడు హరికృష్ణ. ఆమెను వదిలి వెళ్ళడం అతనికీ బాధగానే ఉంది. కాని, అతను మగవాడు. పళ్ళ బిగువున భరించుకుంటున్నాడు.

హరికృష్ణ ఆమెను సమీపించాడు. అనివార్యంలా హృదయానికి హత్తుకోవా లనిపించింది. కానీ, అది స్టేషన్... శారద పెదవులు మాటలు రాక కంపిస్తున్నాయి. ఆమె ముఖం వర్షించబోయే మేఘంలా ఉంది. అనునయంగా భుజం తట్టాడు హరికృష్ణ. అంతే. అందుకే ఎదురుచూస్తున్నట్లుగా జలజలా రాలాయి కన్నీళ్ళు. ప్రేమగా కన్నీళ్ళు తుడిచాడు. ఆ చేతిని అలాగే పట్టుకుని నిమురుతూ ఉండిపోయింది.

గంట కొట్టారు. ఇద్దరూ ఖాంలోకి వచ్చారు. ఇందాకటినుంచీ తన చేతుల్లో నలుగుతూన్న అడ్రెస్ కాగితాన్ని అతడి కోటు జేబులో కుక్కుతూ, "ఉత్తరం వ్రాయండి— మరిచిపోకుండా" అన్నది అతి ప్రయత్నం మీద. తల వూపాడు హరికృష్ణ, ప్రేమగా చేతిని నొక్కుతూ.

రైలు కదిలింది. రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది శారద. అతని మనసు మరీ ఆర్ద్రమైంది. రెండు కన్నీటి చుక్కలు అతని ప్రయత్నాన్ని మించి కిందికి రాలాయి. నెమ్మదిగా చేయి ఎత్తి గాలిలో ఆడించాడు.

* * * *

ఏడాది తిరగకముందే శారదా హరికృష్ణలు దంపతు లయ్యారు. పెద్దల ఆశీర్వచనంతో ప్రేమించుకోకుండా పెళ్ళి చేసుకున్న వాళ్ళ తొలిరేయి సిగ్గు బిడియాలతో, భయ సంకోచాలతో గడుస్తుంది. మరి, ప్రేమించి పెళ్ళి చేసుకున్న వారి శోభనం రాత్రో?

ముత్తైదువలు శారదను తెల్లటి పట్టుచీరలో, ఒడనిండా మల్లెలతో ముద్దుగా సింగారించి, గదిలోకి తోశారు. ప్రకృతి సోయగం ఆకాశం పాలు పడుతున్న వేళ, రాగిచెట్టు ఆకులు వెన్నెలలో తెల్లగా, వెండిలా మెరుస్తున్నాయి. శారద తల వంచుకుని అలాగే నిలబడింది గుమ్మంలో. పాల నురుగులాంటి పట్టుచీరలో, పసిమిచాయ మేనితో మెరిసిపోతూన్న శారదను సమీపించి, కాస్త దూరంగా నిలబడి, చిరునవ్వుతో చూస్తున్నాడు హరికృష్ణ. తల ఎత్తి చూసిన శారదకు ఎదురుగా చేతులు కట్టుకుని హుందాగా నిలబడిన హరికృష్ణ కనిపించాడు.

చామంతి పూలతో అలంకరించిన మంచం, పరుపు నిండా తెల్లని మల్లెలు, దిండ్లపై అందంగా ఎంబ్రాయిడరీ చేసిన "స్వీట్ హార్ట్", "గుడ్‌నైట్"లు గుమ్మాలకు ముద్దబంతి పూల తోరణాలు, మంచం పక్కనే రకరకాల మిఠాయిల పళ్ళెలు, పళ్ళు, పాలు, పూలు, గదినిండా అగరువత్తుల పొగ గుబాళింపు, గదిలో ఒక మూల పెళ్ళికి వచ్చిన కానుకలన్నీ అందంగా ఒక టేబిల్ మీద పేర్చి పెట్టారు.

ఆమె మనసు పరిపరి విధాలా కొట్టుకుపోతూంది. కొత్త పెళ్ళికూతురుకి ఉండవలసిన సిగ్గు కానీ, సంతోషంతో కూడిన భయం కానీ ఆమెకు అనుభూతికి రావడం లేదు. తనేదో తప్పు చేసినట్టూ, ఆ గదిలో ప్రతి వస్తువూ తనను పరిహసిస్తున్నట్టూ, ఆ గదిని తాను ఏదో అపవిత్రం చేయబోతున్నట్టూ అనిపించసాగింది. అక్కడి దృశ్యమంతా ఎందుకో చాలా అస్వాభావికంగా ఉన్నట్లు తోస్తూంది.

హరికృష్ణ ఆమెని దగ్గరికి తీసుకోబోయాడు. కానీ, ఆమె వంగి అతని పాదాలకు నమస్కరించింది. సున్నితంగా ఆమె భుజాలను పట్టుకుని లేవనెత్తాడు. గడ్డం క్రింద వ్రేలు ఉంచి, ముఖాన్ని పైకెత్తి, "శారదా! ఇంకా నీకు ఇంత సిగ్గెందుకు?" అన్నాడు నవ్వుతూ.

కొరడాలా ఛెళ్ళున తగిలిందా మాట శారదకు! "ఇంకా సిగ్గెందుకు!" అవును. తన కింకా సిగ్గెందుకు? సిగ్గుపడవలసిన ఘట్టం ఏనాడో దాటిపోయింది. ఆమె మనసులో ఏదో సంఘర్షణ. కళ్ళ నిండా నీళ్ళు. ఆలోచనల్లో ఏవో కలతలు.

"శారదా! ఏమి టిది! ఈ సంతోష సమయంలో కన్నీళ్ళెందుకు?"

"స్త్రీ సహజమైన సిగ్గు బిడియాలకు, కోరికల కలలకు, ఆనందానికి ప్రతిరూపం ఈ రాత్రి. కానీ, దానికి నేను నోచుకోలేదనే నా బాధ!"

# సమాంతర రేఖలు

మనసుకి వయస్సులేదు!
ఎన్నేళ్ళొచ్చినా అన్నాళ్ళలా అలసిపోకుండా
అందంగా ఊహల నల్లుకుంటుంది
ఊహాతీత ప్రపంచంలో ఉయ్యాల లూగుతుంది
మానస సరోవరంలో ఈత కొడుతుంది
హృదయ ఉద్యానవనంలో విహారాలు చేస్తుంది
ఆకాశం చాపమీద ఆడుకుంటుంది
తారలతో కబుర్లు చెబుతుంది
చకోర పక్షుల కిలకిలారావా నాలకిస్తుంది
మబ్బు పలకీలో తేలిపోతుంది
కోరిన కౌగిలింతలో కరిగిపోతుంది
ఏమైనా చేస్తుంది మనస్సు
మనస్సుకి వయస్సులేదు
వయస్సుకి మనస్సు లేదు!
ముంచుకొస్తుంది కొంపమునిగినట్టు దావానలంలా
వెనకా ముందూ చూడకుండా
పొంగుకొస్తుంది హాలాహలంలా కాస్తయినా
జాగు చేయకుండా
తోసుకొస్తుంది త్రుటిలో ప్రభంజనంలా!
ఉబికి వస్తుంది క్షణంలో ఉప్పెనలా
కాలం కళ్ళలో కారం కొట్టి రెప్పపాటులో వచ్చేస్తుంది
ఏదో ఒకనాడు మనసుని చంపేసి మనిషిని చోటన
బెట్టుకుంటుంది
కాని ఏమీ ఎరగనట్టు తాను తప్పుకుని తప్పుని
మృత్యువు మీద పడేస్తుంది
మనస్సు ఆనందాన్ని కలిగిస్తుంది-
వయస్సు ఆహ్లాదాన్ని హరిస్తుంది-
ఒక్క గాలికలో ఉండి పొంతన లేని
సమాంతర రేఖలు మనస్సు-వయస్సు!!

-శారదా అశోకవరన్

"శారదా! ఏమిటి నీవు మాట్లాడేది? ఇప్పుడు నీ కేమయింది?"

"పెద్దలు ఈ రేయిని ఇంత మధురంగా మలచి ఇచ్చారు. కానీ...కానీ, ఆ నాడు మనం తొందరపడి ఈ రేయి విలువను పడగొట్టుకున్నాం, కృష్ణా! పోగొట్టుకున్నాం. అదే నా బాధ!" చేతుల్లో ముఖం దాచుకుంది.

"ఏమిటా పిచ్చి మాటలు, శారదా? అసలు నీ కేమయింది? ఛీ! ఛీ! ఈ రాత్రి నీ విలా శోకాలతో స్వాగతం పలుకుతా వనుకోలేదు." గొంతులో విసుగు, కోపం!

"హుఁ! ఇది మనకు జీవితాంతమూ మధురంగా జ్ఞాపకం ఉంచుకోవలసిన, అనుభవం పొందవలసిన రాత్రి. కానీ, దీన్ని మనం తొందరపడి ఆ నాడు డాబాపై ..."

"శారదా!" హరికృష్ణ అరుపుతో గది దద్దరిల్లింది. మరుక్షణం ఆమె చెంప ఛెళ్ళుమంది. శారద చలించలేదు. జరిగిం దేమిటో ఆమె వూహించుకో గలిగింది. అయినా, ఆ నాడు జరిగిన విషయాన్ని యథాతథంగా ఏకరువు పెట్టింది.

'ఓ భగవాన్! ఏమి టీ శిక్ష! ఏం పాపం చేశానని నా మీద ఇలా కక్ష సాధించావ్!' అంటూ జుట్టు పీక్కున్నాడు. ఆ నాడు రాత్రి తాను డాబామీదకు రానే లేదన్నాడు. గదిలోనుంచి విసురుగా బయటికి వచ్చి ఒంటరిగా డాబా పిట్టగోడ మీద కూర్చున్నాడు. ఆవేశం చల్లారాక, ఆలోచనలో పడ్డాడు. ఆమె వ్రాసిన ఉత్తరాలు ఒక్కొక్కదాన్నీ జాగ్రత్తగా మననం చేసుకున్నాడు. అవును! అన్నింట్లోనూ తాను ఇంత క్రితం ఆమె నోటి వెంట విన్న నిజం నిక్షిప్తమయ్యే ఉండేది. ఒక ఆడది— అందునా అవివాహిత— ఒక మగవాడికి అంతకన్నా వివరంగా వ్రాయలేదు. తనే అర్థం చేసుకోలేక పోయాడు. ఆ నాడు రైల్వే స్టేషన్లో ఆమె కన్నీటి వెనక ఉన్న అర్థాన్ని ఇప్పుడు గ్రహించాడు.

మనసులో సంఘర్షణ మొదలైంది. తను శారదను క్షమించడమా, మానడమా? ఆలోచన. తల నొప్పి. ఆలోచనల మధ్య సంఘర్షణ. క్షమించు. నో! వద్దు. నో, నో! మరేమిటి? ఏం చేయాలి? రాజీ పడు. నో, నో! నేను ... నేను పురుషుణ్ణి. ఆలోచనలు. సంఘర్షణలు. టిక్ ... టిక్... టిక్...టిక్...

ఆలోచనలతో సమయం తెలియడం లేదు. కాలం కన్నా వేగంగా పరుగెత్తుతున్నాయి ఆలోచనలు. సెకనుకు సవాలక్ష ఆలోచనలు. వాటి మధ్య మళ్ళీ సంఘర్షణ.

టంగ్...టంగ్ టంగ్ ... టంగ్ ... ఆలోచనలకు బ్రేకు. సమయం నాలుగు గంటలు.

ఒక మనిషిగా, చదువు, సంస్కారం కలవాడుగా సాగుతూంది అతని ఆలోచన. తెలిసో, తెలియకో తప్పు జరిగిపోయింది. ఆ తప్పు ఆమెది కాదు. జరిగిన పాపానికి ఆమె బాధ్యురాలు కాదు — అన్న నిజం గ్రహించేసరికి చాలా ఆలస్యమయిందన్నట్లు కింది నుంచి గోడ గడియారం కొట్టిన ఆరు గంటలు వినిపించాయి. తూరుపు కొండల్లో సూర్యకిరణాలు నెమలి ఫించంలా విచ్చుకుంటున్నాయి.

తలుపు తోసుకుని గదిలోకి వచ్చిన హరికృష్ణకు నేలపై నిర్మలంగా నిదురపోతూన్న శారద కనపించింది. ఇలాంటి నిష్కపట ప్రేమ స్వరూపిణినా తాను తిరస్కరించింది? పరిపూర్ణమైన స్త్రీత్వంతో పసిపిల్లలా, ఇంకా పసితనం వీడని అమాయకత్వం ఆమె వదనంలో ద్యోతక మవుతూంది. తను కొట్టిన చెంపదెబ్బ తాలూకు వేళ్ళముద్ర లింకా అలాగే ఉన్నాయి ఆమె బుగ్గమీద. గాలికి ఎగిరిన ముంగురులు ఆ ముఖం మీద గమ్మత్తుగా కదలాడుతునాయి.

హరికృష్ణ మెల్లగా ఆమె ముంగురులు సవరించాడు. కిందికి వంగి, ప్రేమగా ఆమె పెదవులతో పెదవులు కలిపాడు. శారద పెదవులు చల్లగా తగిలాయి. అంతే! "శారదా!" అన్న కేకతో గది దద్దరిల్లింది. అప్పటికే శారద ఆ పిలుపుల్ని వినలేని దూరాలకు వెళ్ళిపోయింది. నిన్నటి మంగళవాద్యాల, వేదమంత్రాల ధ్వని ఇంకా మ్రోగుతూన్నట్లుగానే ఉంది. కాళ్ళ పారాణి విడనేలేదు. గోరింటాకు రంగు ఇంకా వెలియనే లేదు. జడలో మల్లెలు పూర్తిగా వాడనేలేదు. పెళ్ళి వాసన లింకా ఆ మేనిని వీడనే లేదు. కాని, ఆమె నిండు జీవితం రంగు వెలిసి, వాడిపోయింది. నిన్నటికీ, నేటికీ విధి చేసిన మార్పు హృదయ విదారకంగా తోస్తూంది.

హరికృష్ణ పసిపిల్లవాడులా ఏడుస్తున్నాడు. శారద శవాన్నిహృదయానికి హత్తుకునిచల్లనైన ఆ బుగ్గల్నీ పెదవుల్నీ, నుదుటినీ పిచ్చివాడులా ముద్దాడుతున్నాడు బిగుసుకున్న ఆమె పిడికిలిలో కాగితమేదో కనిపించింది. పిడికిలి విడదీశాడు. ఉత్తరాన్ని విప్పి, గబగబా చదివాడు.

"ప్రియమైన హరికృష్ణకు ప్రేమతో

ఉత్తరం వ్రాయ గలిగినంత స్థిమితంగా లేదు నా మనసు. అయినా, వ్రాయాలి. ఈ ఉత్తరం మీ చేతిలో పడేలోగా నే నీ లోకాన్నే వదలిపోవాలి. నా మరణానికి కారణం మీరు కాదు. మీరు నన్ను తిరస్కరించినందుకే నేను వెళ్ళిపోతున్నానని ఎన్నడూ అనుకోవద్దు. మీరు నన్ను ద్వేషించారని నేను బాధపడడం లేదు. అది మీ తప్పు కాదు. యుగయుగాలుగా మగవాడి రక్తంలో జీర్ణించుకుపోయిన అహంలోనే ఉంది తప్పంతా. దేవుడు సృష్టించిన మొట్టమొదటి మగమనిషి రక్తంలోనే ఉందాస్వభావం. అందుకే నేను మిమ్మల్ని దోషిగా ఎంచడం లేదు. మీ హృదయం నాకు తెలుసు. మీ రిప్పుడు తాత్కాలికంగా నన్ను ద్వేషించినా, తరవాత క్షమిస్తారని తెలుసు నాకు.

నేను బతికి మిమ్మల్ని సుఖపెట్టలేను. జరిగిన దాన్ని మరవలేక, పరిస్థితులతో రాజీ పడలేక, మన జీవితమే నరకప్రాయం కావచ్చు. అందుకే ఈ లోకం నుండి — ముఖ్యంగా మీ జీవితం నుండి నా ఈ నిష్క్రమణ.

ఇక్కడ మీ కో కథ చెప్పాలి.

వెనకటి కో బెస్తవాడు ఉండేవాడు. రోజూ చీకటినే వెళ్ళి చేపలు పట్టి తెచ్చేవాడు. ఒకనాడు చీకటిలోనే చేపలు పడుతున్నాడు. వలలోంచి చేపల్ని తీసి వీపున ఉన్న బుట్టలో వేస్తూండగా ఒక చేప కరిచింది. వాడి కది మామూలే. అందుకే పట్టించుకోలేదు. బుట్ట నిండగానే ఇంటిముఖం పట్టాడు. చేపల బుట్టను మూలన పెట్టి అలసటగా నిద్రపోయాడు. ఇదీ వాడి దిన చర్య.

పొద్దు బారెడెక్కాక వాడి ముసలితల్లి బుట్టలోని చేపల్ని బజార్లో అమ్ముదామని బుట్టను చేటలోకి వంచింది. బుట్టలోంచి ఒక కోడెనాగు బుసలు కొడుతూ బయట పడింది, చేపలతోబాటు. ముసల్ది భయంతో వణికిపోతూ, పరుగు పరుగున వెళ్ళి కొడుకుతో చెప్పింది.

ప్రశాంతంగా ఉన్న బెస్తవాడి ముఖంలో క్షణంలో వేయి రంగులు మారాయి. చీకట్లో తనను కరిచింది చేపనేమో అనుకున్నాడు. అది చేప కాదు. బహుశా ఈ కోడెనాగు అయి ఉంటుంది. అంతే! అప్పటి కప్పుడే నురగలు కక్కుతూ ప్రాణం వదిలాడు.

కథ ఎందుకు చెప్పానో అర్థమయిందను కుంటాను.

మీరు పునర్జన్మను విశ్వసిస్తారో లేదో కాని, నేను మాత్రం గాఢంగా నమ్ముతాను. మళ్ళీ జన్మలో మిమ్మల్నే పొందే భాగ్యం ప్రసాదించమని ఆ భగవంతుణ్ణే కోరుకుంటున్నాను.

—మీ ప్రియబాంధవి శారద."

అతనికి ప్రపంచమంతా ఏమో అయిపోతూన్నట్లు అనిపిస్తూంది. పెళ్ళిలో భాస్కర్ ప్రెజెంట్ చేసిన రాధామాధవుల విగ్రహం నేలపై పడి పగిలి ముక్కలై ఉండడం హరికృష్ణ గమనించనేలేదు. *

